క్లుప్తంగా

చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ



కేటీదొడ్డి: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. సోమవారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ సీఐ లక్ష్మన్‌గౌడు పోలీసుల ఆధ్వర్యంలోని తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి మద్యం, లిక్కర్, డబ్బులు రాకుండా అధికారులు గట్టి బందోబస్తుతో పాటు తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

అమరవాయిలో జోరుగా ఉపాధి హామీ పనులు



మల్దకల్: మండలంలోని అమరవాయి, మల్దకల్ గ్రామాలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు చురుకుగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన ఉపాధి హామీ కూలీలు పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. సోమవారం ఆయా గ్రామాలకు చెందిన 200 మందికి పైగా కూలీలు కంప చెట్ల తొలగింపు పనులను చేపట్టారు. జాబుకార్డులు కలిగిన కూలీలందరూ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ హరికృష్ణ కూలీలకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ



అయిజ: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ మాజీ చైర్మన్ ఆంజనేయులుగౌడ్ పుట్టిన రోజు సందర్భంగా జై నడిగడ్డ యువత సంఘం నాయకులు సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జై నడిగడ్డ యువత జిల్లా చీఫ్ కో–ఆర్డినేటర్ రామకృష్ణ, జిల్లా సమన్వయ కర్తలు వీరేష్, సత్యం, టీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ మల్లికార్జున్, టీఆర్‌ఎస్వీ అలంపూర్ నియోజకర్గం కో–ఆర్డినేటర్ వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక అభిషేకం



ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివునికి అభిషేకం చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు బీచుపల్లికి చేరుకొని భక్తిశ్రద్ధలతో శివుని దర్శించుకున్నారు.

విద్యుత్ స్తంభాల మార్పిడి

అయిజ: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో బస్సులు లోపలికి వెళ్లే ప్రదేశంలో సోమవారం విద్యుత్ అధికారులు కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాల తీగలు కిందకి వేలాడుతుండడంతో బస్‌లు లోపలికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు విద్యుత్ అధికారులు పాత విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో పెద్ద స్తంభాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ నరేందర్‌రెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్‌లు సర్వోత్తమ్, ముక్తర్ పాల్గొన్నారు.



రోడ్లు ధ్వంసమైనా పట్టించుకోరా?



తూంకుంట రోడ్డుపై పడిన గుంతలకు మట్టివేస్తున్న ఆటో డ్రైవర్లు (ఫైల్)

- పునర్నిర్మించకుండా కాలయాపన
- అదుపుతప్పుతున్న వాహనాలు
- ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు

అయిజ: మండలంలోని వివిధ గ్రామాలకు కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన బీటీ రోడ్లు అనేక చోట్ల శిథిలమయ్యాయి. కొన్ని రోడ్లు కంకర తేలి ఉండగా, మరికొన్ని గుంతలు పడ్డాయి. వాహనాలు అదుపుతప్పి బోల్తా పడుతున్నాయి. ప్రయాణం చేసేవారు తీవ్ర గాయాలపాలవుతున్నారు. కొందరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోతున్నారు. వరుసగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా అధికారులు రోడ్లను పునర్ నిర్మించడం లేదు. కనీసం రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చి వాటికి మరమ్మతులు చేయడంలేదు. పాలకులు, అధికారులకు బీటీ రోడ్లకు మరమ్మతులు చేయాలనే ధ్యాసే లేదు.

శిథిలమైన రోడ్ల వివరాలు..

అయిజ నుంచి గట్టుకు ఏర్పాటు చేసిన రోడ్డు శిథిలమైంది. అయితే ప్యాచ్ వర్క్ చేసేందుకు గత సంవత్సరం అధికారులు పనులు మొదలు పెట్టారు. కాంట్రాక్టర్లు కంకర పరిచి వదిలేశారు. దాని వల్ల ఆ రోడ్డు ప్రయాణానికి ప్రతికూలంగా మారింది. అయిజ నుంచి ఉప్పలకు ఇరవై ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు బీటలు బారింది. గుంతలు పడి సంవత్సరాలు గడుస్తున్నా కనీసం ప్యాచ్ వర్క్ కూడా చేయడంలేదు. అయిజ నుంచి అలంపూర్ చౌరస్తా వైపు ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు గుంతలు పడింది. కల్వర్టులు పునర్ నిర్మించకపోవడంతో 5 కల్వర్టుల వద్ద రోడ్డు గుంతలు పడింది. వాహనాలు వెళ్లేందుకు ప్రతికూలంగా మారింది. అయిజ నుంచి గద్వాల వైపు ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు బింగుదొడ్డి స్టేజీ సమీపంలో కి.మీ. దూరం మోకాలులోతు గుంతలు పడి ప్రయాణానికి ప్రతికూలంగా మారింది. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి పులికల్ వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు ఆరు సంవత్సరాల నుంచి నత్తనడకన సాగుతున్నాయి. కంకర పరిచి వదిలేయడంతో ఆ రోడ్డుపై అనేకసార్లు ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. శిథిలమైన రోడ్లను పునర్ నిర్మించి, పాక్షికంగా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



శిథిలమైన ఎక్లాస్‌పురం రోడ్డు

ప్రతిపాదనలు పంపించాం..

శిథిలమైన రోడ్లను పునర్ నిర్మించేందుకు, అవసరమైన చోట ప్యాచ్ వర్క్ చేసేందుకు ప్రతిపాదనలు పంపించాం. అయిజ – గట్టు రోడ్డులో ఎక్లాస్‌పురం వద్ద ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టాం. కొన్ని కారణాలతో పనులు ఆలస్యమవుతోంది. పులికల్ రోడ్డు మూడు కి.మీ. నిర్మించాం. త్వరలో నిర్మాణం పనులు పూర్తి చేస్తాం. కొన్ని గ్రామాల రోడ్లు పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించివి ఉన్నాయి. మా పరిధిలో ఉన్న రోడ్లకు సంబంధించిన పనులు వేగవంతం చేస్తాం.

– మహేష్, ఆర్‌అండ్‌బీ ఏఈ

పునర్నిర్మించాలి



మండలంలోని గ్రామాలకు ఏర్పాటు చేసిన బీటీ రోడ్లు శిథిలమై అనేక సంవత్సరాలు గడిచినా అధికారులు పట్టించుకోవడంలేదు. గుంతల రోడ్లపై ప్రయాణించడంతో బైకులు, ఆటోలు, కార్లు దెబ్బతింటున్నాయి. కాలం చెల్లకముందే వాహనాల టైర్లు అరిగిపోతున్నాయి. దాని వల్ల గ్రామాలకు ఆటోలు రావడానికి డ్రైవర్లు విముకత చూపుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లను పునర్ నిర్మించాలి

– వెంకటేశ్వర్ రెడ్డి, ఎక్లాస్‌పురం

వాహనాలు అదుపు తప్పుతున్నాయి



మడలంలో గ్రామాలకు ఏర్పాటు చేసిన రోడ్లు శిథిలమయ్యాయి. రోడ్లు గుంతలు పడడంతో వాహనాలు అదుపుతప్పి బోల్తా పడుతున్నాయి. దాని వల్ల ప్రజలు గాయాలపాలవుతున్నారు. ఇప్పటికే అనేకమంది గాయపడ్డారు. కొంతమంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోయారు. అయినా సరే అధికారులు స్పందించడంలేదు. శిథిలమైన రోడ్లకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపడితే ప్రమాదాలను తగ్గించవచ్చు

– తిప్పన్న, ఉప్పల

ప్యాచ్ వర్క్‌లు చేపట్టాలి



శిథిలమైన రోడ్లపై ప్రయాణించేందుకు కష్టంగా ఉంది. కనీసం రోడ్లకు ప్యాచ్ వర్క్‌లు కూడా చేయడంలేదు. గుంతలు పడిన రోడ్లను ఎప్పటికప్పుడు మట్టితో పూడ్చాలి. అవసరమైనచోట్ల ప్యాచ్ వర్క్‌లు చేపట్టి బీటీ రోడ్లను పునరుద్ధరించాలి. కల్వర్టుల వద్ద రోడ్డు నిర్మాణం పూర్తి చేయకపోవడంతో ప్రయాణానికి ప్రతికూలంగా మారాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– మహబూబ్ బాషా, అయిజ

విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజోళి: నాణ్యమైన విద్యుత్ అందించే క్రమంలో భాగంగా మంగళవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని ఏఈ సందీప్ ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని 33/11కేవీ పెద్ద తాండ్రపాడు సబ్‌స్టేషన్ పరిధిలో గల తుమ్మిళ్ల, పెద్దతాండ్రపాడు, తుమ్మిళ్ల, అశోక్‌నగర్, ముండ్లదిన్నె గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా మరమ్మతులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

అయిజ: నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చేపడుతున్న మరమ్మతుల కోసం మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ నరేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని పర్దీపురంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు సంబంధించి మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయిజ పట్టణంలోని దుర్గానగర్, ప్రభుత్వ ఆస్పత్రి, పాత బస్టాండ్, తూంకుంట రోడ్డు, ఎస్సీ కాలనీలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. మండలంలోని తొత్తినోనిదొడ్డి, చిన్న తాండ్రపాడు, సింధనూరు, బైనిపల్లి, పులికల్, కొత్తపల్లి, మూగోనిపల్లి, కేశవరం, మేడికొండ, తుపత్రాల గ్రామాలకు విద్యుత్ సరఫరా రెండు గంటల పాటు నిలిపేస్తున్నట్లు ఏఈ పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాంగ్రెస్ ఆదరణ తట్టుకోలేక దీక్షలు

గద్వాల అర్బన్: కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక బీఆర్‌ఎస్ నాయకులు దీక్షలు చేస్తున్నారని ఆ పార్టీ మాజీ అధికార ప్రతినిధి శెట్టి ఆత్మకూర్ లక్ష్మణ్ అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో గోన్‌పాడు మిషన్ భగీరథ తాగునీటిని అక్రమంగా మళ్లించినప్పుడు ఎమ్మెల్యేకు జలదీక్ష గుర్తుకు రాలేదా? అని నిలదీశారు. నడిగడ్డలోని కృష్ణ పరివాహక ప్రాంతంలోని గ్రామాల్లో నిషేధిత క్యాట్ ఫిష్ చెరువులకు అక్రమంగా కృష్ణ నీటిని తరలించినప్పుడు జలదీక్ష గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. గద్వాల ప్రజలపై ప్రేమతో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి జలదీక్ష చేయడం లేదని, కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు మెప్పు కోసమే జలదీక్ష చేపట్టారన్నారు. సమావేశంలో నాయకులు రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రామకృష్ణ, రాఘవేంద్ర, ఆనంద్ గౌడ్, శ్రీను, రామకృష్ణ ఉన్నారు.



మాట్లాడుతున్న శెట్టి ఆత్మకూర్ లక్ష్మణ్

కబడ్డీ టోర్నీ విజేత పంచలింగాల



అలంపూర్‌లో విజేత జట్టుతో నిర్వాహకులు

అలంపూర్: కబడ్డీ టోర్నమెంట్ విజేతగా పంచలింగాల జట్టు నిలిచింది. అలంపూర్ పట్టణంలోని న్యూప్లాట్స్ కాలనీలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 13, 14వ తేదీలలో కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నీలో మొత్తం 28 జట్లు పోటీ పడగా, ఈ నెల 14న అర్ధరాత్రి వరకు కొనసాగాయి. కబడ్డీ టోర్నమెంట్‌లో మొదటి విజేతగా పంచలింగాల జట్టు నిలువగా, రెండో విజేతగా కర్నూల్ జిల్లా అలూరు జట్టు, మూడో విజేతగా పారుమంచాల జట్టు నిలిచాయి. మొదటి విజేతకు వందేమాతరం ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య రూ.10 వేల నగదు అందజేశారు. రెండో విజేతకు ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ రాజు రూ.5 వేల నగదు అందజేశారు. మూడో విజేతకు సంతోష్‌నగర్‌కు చెందిన రమేష్ రూ.3 వేల నగదు బహుమతిగా అందించారు. మాంటిస్సోరి పాఠశాల యాజమాన్యం క్రీడాకారులకు భోజన వసతి కల్పించడంతో నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ అశోక్ కుమార్, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు డీ రమేష్, చిన్న మద్దిలేటి, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆశన్న, నిర్వాహకులు పీఈటీ బలగం నాగరాజు, అజయ్, లింగం, బాబు, పరశురాముడు, ప్రశాంత్, విల్సన్, పవన్, చందు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

గద్వాల అర్బన్: ప్రజల దహం తీర్చేందుకు రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవిలో ఆటో, రిక్షా కార్మికులు, ప్రజలకు చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్, కౌన్సిలర్లు నాగిరెడ్డి, నరహరి శ్రీనివాసులు, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు ఉన్నారు.



ప్రజలకు నీరు అందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్

‘హరితహారం’ కోసం మొక్కల పెంపకం



నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు

- నర్సరీల సంరక్షణకు ప్రత్యేక చర్యలు
- 23 గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న పనులు

కేటీదొడ్డి: ఆకుపచ్చని తెలంగాణ కోసం రాష్ట్ర ప్రభుత్వం హరితహారానికి శ్రీకారం చుట్టింది. ఏటా లక్షలాది మొక్కలు నాటుతూ అడవుల శాతాన్ని పెంచుతోంది. అయితే ప్రతి సీజన్‌లో మొక్కలు కావాలంటే ఇతర ప్రాంతాల నుంచి తెప్పించుకోవాల్సి వచ్చేది. అది కూడా ముందస్తుగా సమాచారం ఇస్తే గాని లభించేవి కాదు. ఫలితంగా లక్ష్యం నెరవేరకపోయేది. ఈ పరిస్థితులను గుర్తించిన ప్రభుత్వం దూరదృష్టితో పల్లె పట్టణాల్లో నర్సరీలు ఏర్పాటు చేసుకోవాలని గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు గ్రామ పంచాయతీలు, పట్టణాల్లో ప్రత్యేక నిధులతో నర్సరీలు ఏర్పాటు చేశారు. ఆయా పంచాయతీ, పట్టణం లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు పెంచుతున్నారు. నర్సరీల సంరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. మొక్కలకు ఎండ నుంచి రక్షణ కోసం గ్రీన్‌షేడ్ నెట్లను అమర్చారు.

ప్రత్యేక చర్యలు..

మండల పరిధిలోని 23 గ్రామాల్లో ప్రభుత్వ లక్ష్యం మేరకు 2.30 లక్షల మొక్కలు పెంచుతున్నారు. ఈ నర్సరీలలో మొక్కలకు ఎండ బారి నుంచి రక్షణ కోసం గ్రీన్‌షేడ్ నెట్లను ఏర్పాటు చేశారు. జూన్ మాసం నాటికి మొక్కలను సిద్ధం చేసేందుకు అధికారులు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా ఎవెన్యూ ప్లాంటేషన్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇందులో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేందుకు సిద్ధమవుతున్నారు.

30 రకాల మొక్కలు..

ఆయా నర్సరీల్లో అధికారులు రకరకాలుగా మొక్కలు పెంచుతున్నారు. పండ్లు, పూలు, నీడనిచ్చే సుమారు 30 రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. జామ, నల్లనేరేడు, చక్రమల్లే, మందారం, నేరేడు, మల్లె, చామంతి, గన్నేరు, గులాబీ, దానిమ్మ, కానుగ, పారిజాతం, సీతాఫలం, వివిధ రకాల పండ్ల మొక్కలను పెంచుతున్నారు. రకరకాలుగా మొక్కలతో నర్సరీలు పచ్చదనం పరుచుకొని చిట్టడవిని తలపిస్తున్నాయి.



నర్సరీలను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్

అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం



గ్రామాల్లోని నర్సరీలలో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అందుల్లో భాగంగా నర్సరీపై గ్రీన్ షేడ్ నెట్‌లను ఏర్పాటు చేయించాం. ఎండాకాలం మొక్కలు ఎండిపోకుండా రెండు పూటల నీరు పట్టిస్తున్నాం. వచ్చే విడత హరితహారంలో కేటీదొడ్డి మండలంలోని అన్ని గ్రామాల్లో మొక్కలు నాటేందుకు ఆయా గ్రామాల అధికారులతో ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

– సయ్యద్‌ఖాన్, ఎంపీఓ, కేటీదొడ్డి

లక్ష్యం మేరకు పెంచుతున్నాం..

లక్ష్యం మేరకు పెంచుతున్నాం. వచ్చే హరితహారం కార్యక్రమానికి ప్రతి నర్సరీల్లో పదివేల మొక్కల వరకు విత్తనాలు నాటి పెంచుతున్నాం. అధికారుల సూచనల మేరకు ప్రణాళిక సిద్ధం చేసుకొని వచ్చే వర్షాకాలనికి ప్రజలకు కావాల్సిన మొక్కలు అందుబాటులోకి ఉండేలా పెంచుతున్నాం. ప్రతిరోజు నీరు అందిస్తున్నాం.

– వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శి, ఉమిత్యాల

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

మల్దకల్: ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ స్వరూపారాణి గర్భిణులు, బాలింతలకు సూచించారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. నెలనెలా వైద్యపరీక్షలు చేయించుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం : కేసు నమోదు

మానవపాడు: మండల కేంద్రంలోని చిన్నపోతులపాడు గ్రామంలో మహిళ అదృశ్యమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్ వివరాల ప్రకారం.. మానవపాడు మండలంలోని చిన్నపోతులపాడు గ్రామానికి చెందిన కళా ప్రమీల (34) ఆదివారం ఇంట్లో ఎ వరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. చుట్టు పక్కల, బంధువులతో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె భర్త మల్లికార్జున్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

వరిధాన్యం నాణ్యతగా తీసుకరావాలి

గద్వాల వ్యవసాయం: కొనుగోలు కేంద్రాలకు వరిధాన్యం నాణ్యతతో తీసుకరావాలని జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్ప ఒక ప్రకటనలో తెలిపారు. మట్టిపెడ్డలు, తాలు, తేమశాతం 17కు మించకుండా, బాగా ఆరబెట్టి తీసుకరావాలని రైతులకు సూచించారు. ఏ–గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2203, సాధారణ రకం క్వింటాలుకు రూ. 2,183 మద్దతు ధర ఉంటుందని పేర్కొన్నారు. రైతులు తప్పక నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆమె పేర్కొన్నారు.

రథ సప్తమి పూజలు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్పస్వామి ఆలయంలో రథ సప్తమి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామ నవమి మహోత్సవాల సందర్భంగా ఈ పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వేములలో బీజేపీ ప్రచారం

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని వేములలో సోమవారం బీజేపీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో 32, 33 పోలింగ్ బూత్‌లలో ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు మహేంద్ర, మహేష్, రాజు, శివ, శ్రీను, నవీన, కేశన్న, శివన్న, రామిరెడ్డి ఉన్నారు.



వేములలో ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు

ఎర్రవల్లి మండల విద్యాధికారిగా రాజు



ఎర్రవల్లిచౌరస్తా: ఇటీవల నూతన మండలంగా ఆవిర్భవించిన ఎర్రవల్లి మండల విద్యాధికారిగా రాజు సోమవారం నియమితులయ్యారు. కొన్ని సంవత్సరాలుగా ఆయన ఉమ్మడి ఇటిక్యాల మండల విద్యాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తుండగా, ఎర్రవల్లి మండల ఎంఈఓగా ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా విద్యాధికారి కార్యాలయం నుంచి గెజిట్ విడుదల చేసినట్లు తెలిపారు. ఆయా మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను మెరుగు పర్చడంతో పాటు విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరేందుకు కృషి చేస్తానని తెలిపారు.

నేడు కాంగ్రెస్ పార్టీ కార్నర్ సమావేశం

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్నర్ సమావేశం నిర్వహించనున్నట్లు మండలాధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లురవి రానున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వనపర్తి కవులకు సన్మానం

వనపర్తిటౌన్: తెలంగాణ పద్య సరస్వతి పీఠం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం రాత్రి పద్య కవి సమ్మేళనంలో పాల్గొన్న వనపర్తి కవులను నిర్వాహకులు సన్మానించారు. పద్యానికి పూర్వ వైభవం తెచ్చేందుకు తె లంగాణ పద్య సరస్వతి పీఠం రాష్ట్ర అధ్యక్షుడు అవుసల భానుప్రకాశ్ ఆధ్వర్యంలో పద్యకవులతో శతకవి సమ్మేళనం నిర్వహించారు. వనపర్తి పద్య కవులైన బస్వోజు సుధాకరాచారి, నాయకంటి నరసింహా శర్మ, ఆకుల శివ, రాజలింగం ఉన్నారు.